క్లుప్తంగా

రక్త దానం.. ప్రాణదానం

నందికొట్కూరు: రక్తదానం చేయడమంటే మరొకరికి జీవితాన్ని ప్రసాదించినట్లేనని ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు రక్తదానం చేయడం పట్ల అపోహలు, భయాలు నివృత్తి చేశారు. 20 మంది విద్యార్థినీ, విద్యార్థులు రక్త దానం చేశారు.

పోటీ పరీక్షలతో విజ్ఞానం

పాములపాడు: విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విజ్ఞానం పెంపొందుతుందని హెచ్ఎం వెంకటసుబ్బమ్మ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ద్రాక్షాయిని బాయి, శారద మనోరంజని, రంగారెడ్డి పాల్గొన్నారు.

లోక్అదాలత్పై సమీక్ష

ఆత్మకూరు: స్థానిక కోర్టులో శనివారం సీనియర్ సివిల్జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి ఆధ్వర్యంలో న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డిసెంబర్ నెల 9న నిర్వహిస్తున్న జాతీయ లోక్అధాలత్లో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సివిల్ కేసులతో పాటు, రాజీ అయ్యేందుకు అవకాశమున్న కేసుల్లో కక్షిదారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కేశవరెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్రెడ్డి, వెంకటేశ్వర్లు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో కారు దగ్ధం



శ్రీశైలంప్రాజెక్ట్/పెద్దదోర్నాల: ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఓ కారు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైన సంఘటన శుక్రవారం రాత్రి పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డు శిఖరేశ్వరం సమీపంలో చోటు చేసుకుంది. ఘటనలో కారులోని ప్రయాణికులు ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన గాలి మురళీమోహన్ శ్రీశైల పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో కార్మికులకు జీతాలు చెల్లించేందుకు పోరుమామిళ్ల నుంచి ఏపీ 21 బీఎల్ 0459 డస్టర్ కారులో శ్రీశైలం వెళ్తుండగా శిఖరం సమీపంలోని బయ్యన్నసెల వద్ద కారులో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు కాలనీకి చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో శ్రీశైలం ఘాట్రోడ్డులో వాహనాల రాకపోకలకు కొద్దిపాటి అంతరాయం ఏర్పడింది. షార్ట్ సర్క్యూట్తోనే కారులో మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్

నందికొట్కూరు : పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శనివారం మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ను ఏర్పాటు చేశారు. ఇందులో పట్టణంలోని వివిధ పొదుపు సంఘాలకు చెందిన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచి అమ్మకాలు జరుపుతున్నట్లు మెప్మా సీఎంఎం శాంతకుమారి తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, టీఎల్ఎఫ్లు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సమగ్రంగా తయారు చేయాలి



మాట్లాడుతున్న జేసీ రాహుల్కుమార్ రెడ్డి

నందికొట్కూరు: ఓటరు జాబితాను సమగ్రంగా తయారు చేయాలని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీక్ల స్కూల్లో నియోజకవర్గ స్థాయి ఓటరు జాబితా సవరణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల వారీగా బీఎల్వోలు తయారు చేసిన ఓటరు జాబితా సవరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తహసీల్దార్లను ఆదేశించారు. బీఎల్వోలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీఓ దాసు, తహసీల్దార్లు రాజశేఖర్బాబు, పుల్లయ్య, ప్రకాష్బాబు, భారతి, రత్నరాధిక, ఎలక్షన్ డీటీ కిషోర్, చంద్రశేఖర్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు ఎంఈఓ ఫైజున్నీసా బేగం సూచించారు. శనివారం పగిడ్యాలలోని కబడ్డీ శిక్షణా శిబిరాన్ని సందర్శించిన ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్రావు, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, సీనియర్ ఉపాధ్యాయులు రమణారావు, రషీద్ మియ్య, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం

- ఈ నెల 24న ఆత్మకూరులో వైఎస్సార్సీపీ బస్సు యాత్ర
- విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు
- జగనన్న ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందంటున్న ఆయా వర్గాల నాయకులు



నంద్యాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న శ్రీశైలం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్సార్సీపీ అధికారం చేపట్టాక బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేసింది. రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కూడా చరిత్రను మార్చే విధంగా సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి సముచిత న్యాయం చేశారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించారు. ప్రధానంగా రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పదవులిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి కూడా ఆయన దారిలోనే పయనిస్తూ అదే స్థాయిలో శ్రీశైలం నియోజకవర్గంలో రాజకీయంతో పాటు పార్టీలోనూ అన్ని వర్గాలకూ స్థానం కల్పించడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం

శ్రీశైలం నియోకవర్గంలో మైనార్టీలకు ప్రాధాన్యమిస్తూ ఆత్మకూరు పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షుడిగా సయ్యద్మీర్, రాష్ట్ర షేక్కార్పొరేషన్ డైరెక్టర్గా అంజాద్అలీ, ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్గా ఆసియామారూఫ్, జేఏసీ కన్వీనర్గా సుల్తాన్, వెలుగోడు జెడ్పీటీసీగా అమిరున్బీ, వెలుగోడు పట్టణ వైఎస్సార్సీపీ అధ్యక్షుడిగా ఇలియాజ్ ఖాన్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా సులేమాన్, మార్కెట్యార్డ్ డైరెక్టర్గా ఫాతిమాబీ, శ్రీశైలం రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా రజాక్లకు అవకాశమిచ్చారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మార్కెట్యార్డ్ చైర్మన్గా బాలస్వామయాదవ్, ఎంపీపీ తిరుపాలమ్మ, వైస్ చైర్మన్గా రాజగోపాల్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిమోతి, బీసీ సంయుక్త కార్యదర్శిగా గుండయ్య యాదవ్, బండిఆత్మకూరు మండలం వైస్ ఎంపీపీలుగా రమణ, మధురవాణి యాదవ్, పడమటూరు సొసైటీ చైర్మన్గా లింగం, మేదర కార్పొరేషన్ డైరెక్టర్గా మధురవాణి ఇలా పార్టీలోనూ, పదవుల్లోనూ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. అంతేకాకుండా సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సొసైటీలు, నామినేటెట్ పదవు ఇలా అన్ని రంగాల్లో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు కట్టబెట్టారు.

ఈ నెల 24న ఆత్మకూరు బస్సుయాత్ర

వైఎస్సార్సీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించేందుకు పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 24న పట్టణంలోని గౌడ్సెంటర్లో బస్సు యాత్ర సందర్భంగా భారీ బహిరంగసభను, భారీ ర్యాలీని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ప్రధాన నేతలతో పాటు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ బ్రహ్మానందరెడ్డి హాజరుకానున్నారు. పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కార్యక్రమానికి శ్రీశైలం, వెలుగోడు, బండిఆత్మకూరు, ఆత్మకూరు, మహానంది మండలాల నుంచి వేలాది మంది యాత్రలో పాల్గొననున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఏర్పాట్లులో నిమగ్నమయ్యారు.

నంద్యాలకు తరలివెళ్లిన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరులో జరుగుతున్న సామాజిక, సాధికార బస్సు యాత్ర నిర్వహణ నిమిత్తం శనివారం నంద్యాలలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆత్మకూరు నుంచి పెద్దఎత్తున వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సమావేశం రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.

అన్ని వర్గాల్లో ప్రాధాన్యత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అధికారం చేపట్టాక అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం వలన కార్పొరేషన్లలో కూడా పదవులు దక్కాయి. ఈ కోవలేనే తనకు రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్గా పదవి వరించింది. పార్టీలో మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పెద్ద పీట వేయడం సీఎం జగనన్నతోనే సాధ్యమైంది.

–అంజాద్అలీ, రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్

వైఎస్సార్సీపీ పాలనలోనే మహిళలకు సముచిత స్థానం



రాష్ట్రంలో వైఎస్సార్సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్జగన్మోహన్రెడ్డి 50 శాతం మహిళలకు రిజర్వేషన్కల్పించడం వలనే మహిళలకు సముచిత స్థానం లభించింది. తాను డాక్టర్ చదువుతూ రిజర్వేషన్ ఉండడం వలన ఆత్మకూరు తొలి మున్సిపల్ చైర్పర్సన్గా ఎంపికవ్వడం సంతోషంగా ఉంది. మహిళలకు సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్జగన్మోహన్రెడ్డి, ఎమ్మెల్యే శిల్పాకు కృతజ్ఞతలు. – ఆసియామారూఫ్, మున్సిపల్ చైర్పర్సన్, ఆత్మకూరు

జగనన్నతోనే పదవులు



వైఎస్సార్సీపీ అధికారం చేపట్టాక మాలాంటి దళిత సామాజిక వర్గానికి చెందిన వారికి కూడా సముచిత స్థానం లభించింది. తనకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం ఎంతో సంతోషం కలిగించింది. వైఎస్సార్సీపీలో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం వలనే దళిత వర్గానికి పదవులు వరించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డికి ధన్యవాదాలు.

–తిమోతి , వైఎస్సార్సీపీ జిల్లాప్రధాన కార్యదర్శి

సహకార బ్యాంకులో జీరో ఖాతా



పతాకావిష్కరణ చేస్తున్న మేనేజర్, చైర్మన్, సీఈఓ

జూపాడుబంగ్లా: సహకార కేంద్ర బ్యాంకులో ఆసక్తి ఉన్న వారికి జీరో ఖాతా ప్రారంభిస్తున్నట్లు నందికొట్కూరు బ్యాంకు మేనేజర్ సరోజమ్మ తెలిపారు. సహకార సొసైటీ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం జూపాడుబంగ్లాలోని 80బన్నూరు సహకార సొసైటీ వద్ద పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2024 జనవరి 30 వరకు సహకార కేంద్రబ్యాంకులో జీరోఖాతాలు ఇస్తున్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీరో ఖాతాతో పాటు ఉచితంగా ఏటీఎం కార్డు, రూ.500ల రుసుముతో చెక్బుక్ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉచితంగా ప్రధాన మంత్రి సురక్షా బీమా పథకం ఏడాది పాటు వర్తించేలా చేస్తున్నట్లు వెల్లడించారు. సొసైటీ సీఈఓ చంద్రశేఖర్గౌడు మాట్లాడుతూ 80బన్నూరు సహకార సొసైటీకి ప్రస్తుత రబీ సీజన్కు గాను రూ.2కోట్లు మంజూరు కాగా అందులో ఇప్పటిదాకా రూ.50లక్షల రుణాలు రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెంకటరమణ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక కృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ సురేష్, అసిస్టెంటు మేనేజర్ చక్రపాణిరెడ్డి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ దాసు

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీసీ కులాలకు సంబంధించిన కులగణన సర్వే ప్రక్రియను అధికారులు ఎలాంటి తప్పుల్లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ దాసు సూచించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐదు మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ దాసు మాట్లాడుతూ కులగణన సర్వే ప్రక్రియను రాజకీయాలతో సంబంధం లేకుండా నిర్వహించాలన్నారు. సర్వేపై ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రాజశేఖర్బాబు, పుల్లయ్య యాదవ్, ఎంపీడీవోలు శోభారాణి, జీఎన్ఎస్రెడ్డి, డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు సహకరించండి

ఆత్మకూరు: కుల గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ మోహన్కుమార్ కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కులగణనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన నిర్వహించేందుకు అధికారులు ,వ లంటీర్లు ఇళ్ల వద్దకు వచ్చి వివరాలను నమోదు చేస్తారని, కుటుంబ సభ్యులు వివరాలను తెలిపి సహకరించాలన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ వాయిదా

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 17 నుంచి జరగాల్సిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జేఏసీ కన్వీనర్ సుల్తాన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ఎస్పీజీ పాలెం, 29న లక్ష్మీనగర్, 30న గరీబ్ నగర్, డిసెంబర్ 1న రహమత్నగర్లో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 24న చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: అంగన్వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, కోశాధికారి లక్ష్మీదేవి అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం రిలేనిరాహార దీక్షను నిర్వహించారు. వారు మాట్లాడుతూ హెల్పర్స్ ప్రమోషన్లకు 5 సంవత్సరాలు పెంచాలని, వేతనాన్ని తెలంగాణ ప్రభుత్వంలా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యునియన్ నాయకురాళ్లు చెన్నమ్మ, వెంకటలక్ష్మీ, ప్రమీళమ్మ, ఫాతిమ, వసంత తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి కులగణన సర్వేపై శిక్షణ

పగిడ్యాల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లకు కుల గణన సర్వేపై శిక్షణా తరగతులు ఉంటాయని ఎంపీడీఓ వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న వంద మందికి(నెహ్రూనగర్–1, 2, పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి) వలంటీర్లు శిక్షణకు ఉంటుందన్నారు. 21న 77 మంది (లక్ష్మాపురం–1, 2, 3), 22న 87 మంది (పగిడ్యాల–1, 2, 3) సచివాలయాల వలంటీర్లు శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

బ్యాంకు ఖాతాలో నుంచి నగదు మాయం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన ఉస్మాన్అలీ అనే రైతు బ్యాంక్ ఖాతా నుంచి రూ.లక్ష 20 వేలు డ్రా అయినట్లు మెసేజ్రావడంతో యునియన్ బ్యాంక్ వద్దకు వెళ్లాడు. బ్యాంక్లో తాను దాచుకున్న రూ.3లక్షల 30 వేలలో నుంచి రూ.లక్ష 20వేలు డ్రా అయ్యాయని మేనేజర్కు ఫిర్యాదు చేశాడు. తాను ఇటీవల మొక్కజొన్న పంట సాగు చేయగా అందుకు సంబంధించిన డబ్బు బ్యాంక్లో జమ అయ్యాయని, వాటిలోంచి రూ.లక్ష 20 వేలు డ్రా కావడం ఆందోళన కలిగిస్తోందని వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు తెలిపాడు.

గరుడనంది అర్చకుడి మృతి

మహానంది: మహానంది దేవస్థానానికి అనుబంధంగా ఉన్న గరుడనంది ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తూ ఇంటిపేరునే గరుడనందిగా మార్చుకున్న ఎం.శంకరయ్య అలియాస్ గరుడనంది శంకరయ్య(59) శనివారం మృతి చెందారు. ఆయన మృతి బాధాకరమని మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్రెడ్డి, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని అన్నారు. వారు శంకరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, మహానంది ఆలయ అర్చకులు సురేంద్రనాథశర్మకు ధైర్యం చెప్పారు. ముఖ్య అర్చకులు ప్రకాశం శర్మ, మామిళ్లపల్లి రాఘవశర్మ, అర్చకులు రఘుశర్మ తదితరులు పరామర్శించారు.

బైక్ అదుపు తప్పి భార్యాభర్తలకు గాయాలు

నందికొట్కూరు: పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడటంతో భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన మేరకు వివరాలు.. పట్టణానికి చెందిన వీరప్ప 10 బొల్లవరం గ్రామ సమీపంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజారిగా పని చేస్తున్నారు. పట్టణం నుంచి భార్య శివానందమ్మతో కలిసి ఆలయానికి బైక్పై బయల్దేరాడు. మార్కెట్ యార్డు వద్ద బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డారు. దీంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ షాక్తో రైతు మృతి



నాగేశ్వరగౌడు(ఫైల్)

కొత్తపల్లి: పొలంవద్ద విద్యుత్షాక్ తగిలి ఓ రైతు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ హుస్సేన్ బాషా తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన ఈడిగ నాగేశ్వరగౌడ్ (60) శుక్రవారం రాత్రి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో అతని భార్య ప్రభావతి, బావ రాజేష్ గౌడ్ ఫోన్చేసినా ఎత్తలేదు. దీంతో ప్రభావతి కొడుకు ఉదయ్ కుమార్ గౌడ్కు ఫోన్చేసి విషయం చెప్పింది. పక్క పొలంలో అడవి పందుల కోసం కరెంట్ పెట్టారని, ఇటువైపు రావద్దని హుస్సేన్ తనకు ఫోన్చేసి చెప్పాడని, ఇదే విషయాన్ని నాన్నకు చెబుతామని ఫోన్ చేస్తే ఎత్తడం లేదని ఉదయ్ చెప్పడంతో ఆమె వెంటనే పొలం వద్దకు వెళ్లింది. బోరు దగ్గరకు వెళ్లి చూడగా నాగేశ్వరగౌడ్ చనిపోయిపడి ఉన్నాడు. అతని కుడి మోకాలు, కుడి భుజం వేళ్లకు, ఎడమ భుజానికి కాలిన గాయాలున్నాయని ప్రభావతి తెలిపింది. తను పొలం వద్దకు వెళ్లినప్పుడు బోరు వద్ద బోయ హుసేని, పక్క పొలం హుసేనితోపాటు మరో ముగ్గురు బోరువద్ద నిల్చొని ఉన్నారని, ఎవరని కేక వేయగా వారు పారిపోయారని చెప్పింది. కుమారుడు వినోద్ కుమార్గౌడ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిడుతూరు: 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నందికొట్కూరులో మరమ్మతులు చేపట్టనున్నందున ఆదివారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు మిడుతూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, నందికొట్కూరు టౌన్, నందికొట్కూరు రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో..

జూపాడుబంగ్లా: ఉదయం 6 నుంచి 11 గంటల దాకా మండలం వ్యాప్తంగా త్రీఫేస్ కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్కో ఏఈ రామాచారి శనివారం తెలిపారు. ఓవర్లోడ్ సమస్య వల్ల విద్యుత్ సరఫరాలో నెలకొంటున్న అంతరాయాన్ని నివారించేందుకుగాను 132/33 కేవీ విద్యుత్ కేంద్రంలో నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పాములపాడు విద్యుత్ ఉపకేంద్రం నుంచి సింగిల్ఫేస్ విద్యుత్ను ఇళ్లకు సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ పొలాలకు త్రీఫేస్ వినియోగించుకునే రైతులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పగిడ్యాల: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 5వ రోజైన శనివారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ మద్దమ్మ జూనియర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు, సీనియర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విద్యార్థులకు బాలల దినోత్సవంపై క్విజ్ పోటీలు, సీనియర్ విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్కార్డు

మహానంది: గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్కార్డులు అందిస్తున్నామని ఉపాధి హామీ పథకం బండిఆత్మకూరు మండల ఏపీఓ వసుధారెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు, రామాపురం గ్రామాల్లో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా మృతి చెందినా, లేక జాబ్కార్డులు ఉండి పనులకు హాజరు కానివారిని తొలగించి, కొత్తవారికి జాబ్కార్డులు మంజూరు చేస్తామన్నారు.

శ్రీశైలం ఈఓకు రిటైర్డ్ ఉద్యోగుల సన్మానం



ఈఓను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఈఓ డి.పెద్దిరాజును దేవస్థానం రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. శనివారం సాయంత్రం శ్రీశైలదేవస్థానం పరిపాలనా భవనంలోని ఈఓ ఛాంబర్లో ఆయనను యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు రాచయ్యస్వామి, మల్లికార్జునస్వామి, సిద్దయ్యస్వామి, మల్లికార్జున బాబు ఈఓకి వేదాశీర్వచనం చేసి శాలువా సత్కరించారు. ఈ సందర్భంగా ఈఓ చేతుల మీదుగా యూనియన్ రిజిస్ట్రేషన్ నంబర్ను ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ సలహాదారులు టి.నాగమల్లయ్య, కేవీఎస్ రామిరెడ్డి, సి.శరభారెడ్డి, పీవీ శంకరయ్య, ఉపాధ్యక్షులు జి.వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి ఎస్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



ప్రారంభం అనంతరం కోనేరుకు హారతి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, భువనేశ్వరరెడ్డి

- మహానందిలో పునర్నిర్మించిన కోనేరును ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- కల్యాణ మండపం నిర్మాణానికి ఉద్యోగుల చేయూత
- రూ. 35లక్షలతో మినీ కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, శ్రీశైలం తరహాలో మహానందిని అభివృద్ధి చేస్తున్నట్లు ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. రూ. 80లక్షలతో చేపట్టిన కోనేరుల మరమ్మతులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయానికి ఎడమవైపున ఉన్న చిన్నకోనేరు పునర్నిర్మాణం పూర్తవడంతో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునతో కలిసి ప్రారంభించారు. దీంతో పాటు ఉడిపి రమణ కల్యాణ మండపం పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో మహానందీశ్వర స్వామి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ. 35లక్షలతో నిర్మించనున్న కల్యాణ మండప నిర్మాణానికి వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ మహానంది ఉద్యోగులకు వచ్చిన పీఆర్సీ అరియర్స్ రూ. 35లక్షలను ఆలయాభివృద్ధి కోసం వెచ్చించడం అభినందనీయమన్నారు. ఈఓ చంద్రశేఖర్రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహానంది అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, మహానంది ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, నాయకులు అవుతు సాంబిరెడ్డి, బాలవెంకటరెడ్డి, భూమా సుబ్బరామయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా శ్రీనివాసులు, రామచంద్రుడు, ఏఈ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్రెడ్డి పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరు: అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్మీర్, వరాలమాలిక్, కలిముల్లా, ప్రకాష్రావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు



శ్రీకాళహస్తి ట్రస్ట్బోర్డు చైర్మన్కు స్వాగతం పలుకున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శనివారం శ్రీగిరి భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆలయ గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో కార్తీక దీపారాధన చేసుకున్నారు. లక్ష వత్తులు, వెయ్యి వత్తులు, శివలింగాకార దీపాలు, ఓం నమఃశివాయ ఆకారంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు. శనివారం సాయంత్రం దేవస్థానం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారుల నృత్యాలు అలరించాయి.

మల్లన్న సేవలో శ్రీకాళహస్తి ట్రస్ట్బోర్డు చైర్మన్

శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను శ్రీకాళహస్తి ట్రస్ట్బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఓంకారంలో భక్తులసందడి

మహానంది : ఓంకారం క్షేత్రం శనివారం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ గంగా, ఉమా సమేత శ్రీ ఓంకార సిద్ధేశ్వర స్వామివార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. స్థానిక కాశినాయన అన్నప్రసాద వితరణ వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శనివారం మహానందికి విచ్చేశారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు.

చంద్ర పుల్లారెడ్డి స్థూపం ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, నందికొట్కూరు తొలిశాసన సభ్యుడు, తొలి తరం కమ్యూనిష్టు విప్లవ యోధుడు చంద్ర పుల్లారెడ్డి స్థూపం, విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. శనివారం మున్సిపల్ చైర్మన్దాసి సుధాకరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రపుల్లారెడ్డి విద్యార్థి దశ లోనే దేశ స్వాతంత్రం కోసం అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 1952లో నందికొట్కూరు తొలి శాసనసభ్యుడిగా గెలిచారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి డివిజన్ కార్యదర్శి అరుణ్కుమార్, ఏఐకేఎంఎస్ కోశాధికారి గోపాల్, జిల్లా నాయకులు ప్రేమరాజు, పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్బాష తదితరులు పాల్గొన్నారు.